క్లుప్తంగా

క్షీరాభిషేకం



చెన్నారావుపేట : మండలంలోని పాతమగ్దుంపురం గ్రామంలో గల మసీదుకు నిధులు కేటాయించడంతో ముస్లింలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి లావణ్యాసాంబయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి.రఫీ, ఉపసర్పంచ్ మేకల సదయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు బషీర్, మల్లయ్య, సన్ని, జానీ, పాషా, తదితరులు ఉన్నారు.

భగవద్గీత పారాయణం



గీసుకొండ : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి సహిత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా భగవద్గీత పారాయణం చేశారు. ఆదివారం చిన్మయి మిషన్ హనుమకొండ బ్రాంచ్ ఇన్‌చార్జ్ లతిక మాతాజీ, పీఎస్ టీచర్ పి.ఉషారాణి, ఎ.నమ్రత, ఎల్ఐసీ ఉద్యోగి వి.చంద్రశేఖర్, పింగిళి కళాశాల సంస్కృత అధ్యాపకులు ఎస్. శ్రీవిద్య, వి.హరిప్రియలు పాల్గొని భగవద్గీత పారాయణం చేశారు. అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియామకం



ఆవుల శ్రీనివాస్

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా నియమించామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య ఆదివారం తెలిపారు. రెడ్లవాడ, గొట్లకొండ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి శ్రీనివాస్ అందించిన సేవలను గుర్తించి మండల కమిటీలో చోటు కల్పించామన్నారు. అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్దిని శ్రీనివాస్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన అందరికి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి, పార్టీ ఆదేశాలను అనుసరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాటోత్ రమేష్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్‌లు జలగం సంపత్‌రావు, మారం రాము, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్య గుడి కమిటీ ఎన్నిక

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో ఆదివారం దత్తాత్రేయ రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ్య నూతన గుడి నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఐలోని తిరుపతి, ఉపాధ్యక్షుడిగా ఐలోని అభిషేక్, కోశాధికారిగా రాయరాకుల అశోక్, ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరి రాజేశ్, సహాయ కార్యదర్శిగా శివవర్మను ఎన్నుకున్నట్లు కుల పెద్దలు తెలిపారు.

నిల్వ చేసిన నల్లబెల్లం, పటిక స్వాధీనం

చెన్నారావుపేట : టేకులకుంట తండాలో అక్రమంగా నిల్వ చేసిన నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తోట మహేందర్ ఆదివారం తెలిపారు. టేకులతండాకు చెందిన లకావత్ రేణుక తన ఇంట్లో 40 కిలోల నల్లబెల్లం, ఐదు కిలోల పటికను అక్రమంగా నిల్వ చేసింది. పక్కా సమాచారంతో రేణుక ఇంటిపై ఆకస్మిక దాడి చేసి బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నారు. రేణుకపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్ధన్నపేట: అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అంగోత్ అరుణ



చెన్నారావుపేట: ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



చెన్నారావుపేట: తిమ్మరాయినిపహాడ్‌లో..



భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని ఆకేరు వాగు ఒడ్డున ఉన్న పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి తొలుత విశ్వబ్రాహ్మణులు బోనం సమర్పించాలనే ఆనవాయితీ ప్రకారం తొలుత బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు రామగిరి పుల్లాచారి, గౌరవ అధ్యక్షుడు నర్సింహచారి మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన అరుణను శాలువాతో ఘనంగా సన్మానించారు. రామగిరి అనిల్, రామకృష్ణ, భావనచారి, వెలిసోజు కుమారస్వామి, రత్నాచారి, ప్రశాంత్, వేణు, పవన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

నర్సంపేటలో..

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ నాగెళ్లి పద్మప్రసాద్‌తో పాటు ఇతర కౌన్సిలర్లు, మహిళలు పోచమ్మ బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోచమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ, పూజారులు, వలంటీర్స్ ఆలయం వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

సంగెంలో..

సంగెం : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. గవిచర్ల, సంగెం, కుంటపల్లి, ఎల్లూగ్‌రంగంపేట, నర్సానగర్ తదితర గ్రామాల్లో బోనాల వేడుకను నిర్వహించారు. గ్రామ దేవత పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



సంగెం: బోనాలతో వెళ్తున్న మహిళలు

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మతల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాలతో పోచమ్మ దేవాలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కోట మైసమ్మ బోనాలు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల కోటగండి కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారి బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు బొట్టు రాజు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఎర్రోజు రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జోగిని వెంకన్న బృందం వారు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఒగ్గు కళాకారులు, వెల్దండి శ్రీరాములు దంపతులు పాల్గొన్నారు.



సంగెం: గవిచర్లలో..

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. నాచినపల్లి, తిమ్మంపేట, పొనకల్, మందపల్లి, బోబ్బరోనిపల్లి గ్రామాల్లో బోనాలను అలంకరించుకుని డప్పు, చప్పుళ్లతో పోచమ్మ దేవాలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలు చల్లగా ఉండాలని మొక్కుకున్నారు.



నర్సంపేట: పోచమ్మతల్లి దేవాలయంలో..



సంగెం: ఎల్లూగ్‌రంగంపేటలో..



దుగ్గొండి: బొబ్బరోనిపల్లిలో..

అటెన్షన్ ప్లీజ్



పొంచి ఉన్న ప్రమాదం

సంగెం : ఇటీవల కురిసిన వర్షాలకు వరదలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కాపులకనిపర్తి వద్ద వరంగల్-మహబూబాబాద్ ఆర్ అండ్ బీ రోడ్డుపై వరద నీటికి రోడ్డు కొట్టుకుపోయి ప్రమాదంగా తయారైంది. వాహనాలకు ప్రమాదం పొంచి ఉందని సంబంధిత అధికారులు స్పందించి మొరం పోసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమారస్వామి, బుధరావుపేట గ్రామానికి చెందిన కుమార్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాజీ మార్గమే.. రాజమార్గం



దుగ్గొండి: ప్రచారం చేస్తున్న పోలీసులు, నాయకులు



ఖానాపురం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై మాధవ్

● ఫ్లెక్సీలతో పోలీసుల విస్తృత ప్రచారం

దుగ్గొండి : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాజీ మార్గమే-రాజమార్గం అంటూ ఆటోకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎస్సై పరమేష్ ప్రారంభించారు. ఆవేశంలో కొట్టుకున్నాం..ఆలోచించి కలిసి ఉందాం, తిట్టుకున్నాం..మరచిపోదాం, కోపాలు వద్దు..స్నేహమే శాశ్వతం, ప్రతీకారాలతో కాకుండా ప్రగతి పథంలో జీవిద్దాం అంటూ ముద్రించిన పోస్టర్‌లతో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈనెల 9 వరకు లోక్ అదాలత్‌లో రాజీపడే అవకాశాలు ఉన్నాయని కేసులు ఉన్నవారు ఆధార్‌కార్డులతో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో శంకేషి రమేష్, తొగరు వెంకన్న, పాశికంటి శంకర్, రాజేశ్వర్‌రావు, జరుపుల శ్రీనివాస్, యువకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఖానాపురం : జాతీయ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఎస్సై మాధవ్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పెండింగ్ కేసులు ఉన్న వారికి ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీ వరకు పెండింగ్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రాజీపడే కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టిని తొలగించరూ!

వర్ధన్నపేట : వర్ధన్నపేట-జఫర్‌గఢ్ ప్రధాన రహదారిపై నిర్మించిన డివైడర్లలో ఎర్రమట్టి పోసి మిగిలిన మట్టిని రోడ్డుపై అలాగే వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. వర్ధన్నపేట-జఫర్‌గఢ్ ప్రధాన రహదారి డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన ఆ డివైడర్‌లో ఎర్రమట్టి పోసి మొక్కలు నాటారు. డివైడర్‌లో పోసిన మట్టి పోను మిగిలిన దాన్ని అలాగే రోడ్డుపై తొలగించకుండా ఉండడంతో వర్షానికి ఆ మట్టి జారుడుగా తయారై బైక్‌లు, వాహనాలు స్కిడ్ అయి పడిపోతున్నామని, చివరకు పాదాచారులు సైతం పడి పోయే ప్రమాదం ఏర్పడిందని పట్టణవాసులు చెబుతున్నారు. డివైడర్లో పోసిన మట్టితో పాటు ఎప్పటికప్పుడు రోడ్డుపై మిగిలిన మట్టిని తరలించాల్సి ఉండగా అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఎర్రమట్టిని తొలగించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.



డివైడర్ పక్కనే ఉన్న ఎర్రమట్టి కుప్పలు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందినట్లు నర్సంపేట టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన చిలుమల అఖిల్ (24) చెన్నారావుపేట మండల కేంద్రంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. అయితే ఇటీవల రాసిన పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. మళ్లీ రాస్తే పాసవుతానో లేదోనని తీవ్ర మనోవేదనకు గురై నెక్కొండ రోడ్డులో అఖిల్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే స్థానికులు గమనించి 108 వాహనంలో నర్సంపేటలోని స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగ్దుంపురంలో తాపీమేస్త్రీ..

నర్సంపేట రూరల్ / చెన్నారావుపేట : చికిత్స పొందుతున్న తాపీమేస్త్రీ మృతిచెందిన సంఘటన నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామంలో జరిగిందని చెన్నారావుపేట ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ముగ్దుంపురం గ్రామానికి చెందిన కెంచ రాములు (32) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో మదనపడుతూ రెండు రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తినాయక్ తండాలో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని పత్తినాయక్ తండాకు చెందిన బానోత్ రమేష్ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ రమేష్ గత నెల 31న కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సోని, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. రమేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

పర్వతగిరి : తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని వడ్లకొండలో శ్రీరంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసీతారామచంద్రస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రమేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లునావత్ కమలపంతులు, ఎంపీటీసీ అత్తి రేవతికుమార్, ఉపసర్పంచ్ ఉప్పలయ్య, ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఓట్లు, సీట్లు కాదు.. సమస్యలపై చర్చించాలి



సదస్సులో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సదస్సుకు హాజరైన ఉపాధ్యాయులు

● ఉపాధ్యాయుల సదస్సులో ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : ఓట్లు, సీట్లు కాదు.. ప్రజల పాట్లు, సమస్యలు చర్చించడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన 'మీతో మీ రేవూరి ముఖాముఖి' సదస్సులో రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఓట్లు, సీట్లు కాదు ప్రజలకు పాట్లు చర్చించడమే లక్ష్యమని, పార్టీలను పక్కనపెట్టి వ్యక్తిగా వ్యక్తిత్వంతో ఆలోచించాలన్నారు. సంక్షేమ పథకాల హామీలతో ప్రజలను మోసం చేసి బీఆర్ఎస్, నర్సంపేటను అభివృద్ధి చేశానన్న ధీమాతోనే ముందుకు వస్తున్నానన్నారు. తాను, దొంతి మాధవరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి ముగ్గురిలో ఎవరు మెరుగు అనేది మీరే ఆలోచించాలన్నారు. 1994కు ముందు నర్సంపేట నియోజకవర్గం ఎలా ఉండేది.. ఆ తర్వాత ఎలా ఉంది అన్న అంశాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. 2014 తర్వాత తన క్యాడర్ అంతా చెట్టు, పుట్టకొకరుగా చెదిరిపోయారని, వారంతా ఏకమై పోగు కావాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందన్నారు. ధన ప్రభావం ఎక్కువైన ఈరోజుల్లో ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోకపోతే ఎప్పటికి మోసపోతూనే ఉండాల్సి వస్తుందన్నారు. ఏ నిర్ణయం తీసుకుంటే ప్రజలకు మంచి జరుగుతుందో ఆలోచించుకోవాలని ఉపాధ్యాయులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

'ఎర్రబెల్లి' గెలుపులో భాగస్వాములు కావాలి

రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎర్రబెల్లి దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో భాగస్వాములు కావాలని మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు కోరారు. ఆదివారం మండలంలోని కొండాపురం, గట్టికల్ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోదాటి దయాకర్‌రావు, చిన్నాల వనజలక్ష్మీనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిన్నాల శ్రీనివాస్, తేరాల యాకయ్య, చెవ్వు కాశీనాథం, నాయకులు జాజు నాయక్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న గోపాల్‌రావు

'పేదల అభివృద్ధిని కాంక్షించేది కాంగ్రెస్'

నర్సంపేట : పేదల అభివృద్ధిని కాంక్షించేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 24వ వార్డులో ఆదివారం పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనె పద్మ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడారు. దళితుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు రిజర్వేషన్లు కల్పించి నిలువ నీడలేని వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు గూడు లేని నిరుపేదలకు ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న హయాంలోనే దళిత కాలనీలను నిర్మించి నివాస గూడులను ఏర్పర్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ సబ్ ప్లాన్ తీసుకువచ్చి నిధులను బడ్జెట్‌లో కేటాయించి ఎస్సీల అభివృద్ధి కోసం పాటు పడడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరాదరణకు గురవుతున్న హరిజనుల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చి డిక్లరేషన్ ద్వారా ఎస్సీ అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను తీసుకురాబోతున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, ఇస్లావత్ పద్మబాయి, తుమ్మలపల్లి సందీప్, గొర్రె నవీన్, 17వ వార్డు అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, ములుకల మనీష్, 5వ వార్డు అధ్యక్షుడు పొన్నం నర్సింహారెడ్డి, 14వ వార్డు అధ్యక్షుడు డిష్ బాబా, నాయకులు గద్ద శ్రీనివాస్, దేశిసాయి పటేల్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట: కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో దొంతి మాధవరెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం: దొంతి

చెన్నారావుపేట : కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సర్పంచ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్ ఆధ్వర్యంలో దొంతి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తుందన్నారు. పిట్టల దొర మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, సంక్షేమ పాలన అందించే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామఅధ్యక్షుడు కుమారస్వామి, సీనియర్ నాయకులు రాజబోయిన దూడాలు, సూరయ్య, రమేష్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట: ప్రచారం చేస్తున్న నాయకులు

'బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం'

దామెర: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని అవకాశం ఇస్తే నిరూపించి చూపిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుతానిది ఆర్బాటం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. దామెర మండలంగా ఏర్పడి 7 సంవత్సరాలు పూర్తి కావొస్తున్న ఇప్పటికి ప్రభుత్వ భవనాలు నిర్మించలేదని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిరవేర్చకపోగా, మాయమాటలు చెప్పి మరోసారి అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక, ప్రకృతి వనాలు, రైతువేదికలు నిర్మించి రాష్ట్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు.